క్లుప్తంగా

8నుంచి పునరుత్థాన పండగలు

తెనాలి అర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11 వరకు 16వ పునరుత్థాన పండగలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెంచుపేట ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని ఇండోర్ స్టేడియం వద్ద ప్రతి రోజు గురువారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు జరుగుతాయని చెప్పారు. నెల్లూరు హోసన్నా మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ ఆనంద్ జయకుమార్, ఏలూరు మన్నా చర్చ్ నిర్వాహకులు పాస్టర్ ఎం.జ్యోతి రాజు, తెనాలి హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు బ్రదర్ సల్మాన్‌లు క్రీస్తు సందేశం అందిస్తారని పేర్కొన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



తెనాలి టౌన్: పట్టణ 13వ వార్డులోని ఆర్.ఎస్. చర్చిలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్.ఎస్.ఫౌండేషన్ వ్యవస్థాపకులు రెవరెండ్ పల్లె శామ్యూల్ దంపతులు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారిని తల్లిదండ్రులుగా భావించి గౌరవించాలన్నారు. వృద్ధాప్యంలో ఎవరికి బరువుగా, భారంగా ఉండకూడదని తెలిపారు. ప్రతి నెలా తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి, రోహి, వెంకటరమణ, సంఘస్తులు పాల్గొన్నారు.

9నుంచి బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'



తెనాలి టౌన్: మండలంలోని గ్రామాల్లో ఈ నెల తొమ్మిది నుంచి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ తెలిపారు. రూరల్ మండలం అంగలకుదురులో శనివారం కార్యక్రమంపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 9,10,11 తేదీల్లో జరగనున్న పల్లెకుపోదాంలో ప్రతి కార్యకర్తా పాల్గొనాలని కోరారు. 24 గంటలు ఒక గ్రామంలో ఉండి ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు, కొత్తపల్లి యోగానంద కిషోర్, కాలిశెట్టి రమేష్, వీరయ్య, నరసయ్య, బ్రహ్మయ్య, ఉదయ్, సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులను ఆదుకోవాలి



దుగ్గిరాల(తెనాలి): దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు మార్కెట్ ధర ప్రకారం క్వింటాలుకు రూ.11,850 ఇవ్వాలని బాధితుల కమిటీ కన్వీనర్ వి.వెంకటరామయ్య, కో–కన్వీనర్ ఖాజా వెంకటేశ్వరరావు కోరారు. అద్దెలు, వడ్డీలు, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం దుగ్గిరాలలోని పసుపు మార్కెట్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతుల్ని ఆదుకోవాలని కోరారు. పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు మాట్లాడుతూ తక్షణమే రైతులకు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, వెంకటప్పారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బాలరాజు పాల్గొన్నారు.

పట్టాదారు పుస్తకం నిబంధన మినహాయింపుకు వినతి

కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపు పంటను కోల్పోయిన కౌలు రైతులకు పట్టాదారు పాసు పుస్తకం సమర్పించాలనే నిబంధనను సడలించాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేత కొల్లి రంగారెడ్డి, సీపీఐ నాయకుడు బొల్లిముంత కృష్ణ వినతిపత్రాన్ని శనివారం సాయంత్రం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు అందజేశారు. కౌలు రైతులం అయినందున తమలో చాలామందికి పట్టాదారు పుస్తకాలు, కౌలు కార్డులు కూడా లేవని తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలి రూరల్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన వేముల పెదమల్లిపై అదే ప్రాంతానికి చెందిన వేముల పోతురాజు శనివారం సాయంత్రం దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నందివెలుగులో అభివృద్ధి కాంతులు

- గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి శూన్యం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మౌలిక వసతుల కల్పన
- సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, సబ్‌స్టేషన్ నిర్మాణం





గ్రామంలో మెరుస్తున్న సిమెంట్ రోడ్లు

ఇది కదా.. అభివృద్ధి

తెనాలి టౌన్: మండలం నందివెలుగు కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. తెనాలి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నా వసతులు ఒనగూరలేదు. 2019 వరకు పరిస్థితి అంతంతమాత్రగానే ఉంది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దశ మారింది. అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తోంది. గ్రామస్తుల దశాబ్దాల కల అయిన విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రధాన సిమెంట్ రోడ్డు నిర్మాణాలు పూర్తయ్యాయి. మెయిన్ రోడ్డులో సైడ్ డ్రెయిన్స్ నిర్మాణంలో ఉన్నాయి. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సంక్షేమ పథకాల కింద గ్రామస్తుల ఖాతాల్లోనూ నేరుగా నగదు జమ చేయడంతో పలువురు ఆర్థికాభివృద్ధి కూడా సాధించారు.

రూ.70లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం

గ్రామంలో ఎప్పటి నుంచో జరగని పనుల్ని నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేస్తున్నారు. మేడ సెంటర్ నుంచి దుర్గాదేవి గుడి వరకు రూ.35లక్షలతో, రైస్‌మిల్ నుంచి సచివాలయం–2కు వెళ్లే రోడ్డు రూ.30లక్షలతో సిమెంట్ రోడ్లు వేశారు. రెండూ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు గ్రామంలో మరో కొన్ని రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి.

నాడు–నేడు ద్వారా హైస్కూలుకు అదనపు తరగతి గదులు

గతంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పాఠశాల గదులను నేలమట్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడి నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించారు. నాడు–నేడు ద్వారా రూ. 1.92 కోట్లు మంజూరయ్యాయి. వీటితో ఒక బ్లాక్ తరగతి గదులను పూర్తి చేశారు. మరో బ్లాక్ తరగతి గదులు నిర్మాణం చేపట్టాలి. పూర్తయిన వాటిని త్వరలో ప్రారంభించనున్నారు. పాఠశాలలో పదో తరగతి వరకు సుమారు 200 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

నిజాంపట్నం కాల్వపై నడక వంతెన

గ్రామ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో నిజాంపట్నం కాల్వపై రూ.25లక్షలతో నడక వంతెనను ఏర్పాటు చేశారు. ఎరుకలపూడి, అంబేడ్కర్ నగర్‌కు చెందిన ప్రజలు మెయిన్ రోడ్డుకు రావడానికి ఎంతోగానో ఉపయోగపడుతుంది. ఇది కూడా శతాబ్దాల కాలంగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న కల. వంతెన నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరిన శతాబ్దాల కల



గ్రామంలో నిర్మించిన అత్యాధునిక సబ్‌స్టేషన్

గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూ.3కోట్లతో నిర్మించారు. శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ స్థల సేకరణ చేసి సబ్‌స్టేషన్ నిర్మించారు. దీని వల్ల గ్రామంతో పాటు చింతలపూడి, కంచర్లపాలెం, కొలకలూరు, ఎరుకలపూడి గ్రామాల్లో విద్యుత్ కొరత లేకుండా 24 గంటలు సరఫరా ఇస్తున్నారు. దీంతో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరింది.

రూ.75లక్షలతో సచివాలయాల నిర్మాణం

సచివాలయాల నిర్మాణానికిగాను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.75లక్షలు మంజూరయ్యాయి. సచివాలయం–1 భవన నిర్మాణం రూ.35లక్షలతో పూర్తి చేశారు. సచివాలయం–2 భవన నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ. 40లక్షల నిధులతో డ్రెయిన్స్ నిర్మాణం చేపట్టారు.



నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

కేటాయింపులు ఇలా...

- అభివృద్ధి పనులకు రూ.7.69 కోట్ల కేటాయింపు
- అమ్మ ఒడి పథకం కింద 681 మందికి రూ.3,11,28,400 చెల్లింపు
- జగనన్న విద్యాదీవెన కింద 446 మందికి రూ.1,49,49,653 మంజూరు
- రైతు భరోసా కింద 777 మందికి రూ.3,66,26,750 కేటాయింపు
- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 1187 మందికి రూ.11,09,48,750 కేటాయింపు
- వైఎస్సార్ చేయూత కింద 345 మందికి రూ.1,50,93,750 సాయం
- వివిధ సంక్షేమ పథకాల కింద నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.32,20,70,873 జమ
- గ్రామంలో రెండో సచివాలయ భవనం నిర్మాణంలో ఉంది
- సిమెంటు రోడ్లు, సచివాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధం

గ్రామాభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో గ్రామంలో చిరస్థాయిగా నిలిచిపోయే పనులు పూర్తి చేశాం. మా హయాంలో అభివృద్ధి జరగడం గర్వంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే సహకారంతోనే ఇది సాధ్యమైంది. గత ప్రభుత్వాలు అభివృద్ధిని పట్టించుకోలేదు. నందివెలుగు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. – ధూళిపాళ్ల పవన్‌కుమార్, సర్పంచ్

సచివాలయ నిర్మాణం భేష్



గ్రామంలోని ఇందిరానగర్ కాలనీలో సచివాలయం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. దళితుల ప్రాంతంలో సచివాలయం నిర్మించారు. అన్ని పనులు ఇక్కడ నుంచి చేస్తున్నారు. మాకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లే పనిలేదు. వలంటీర్ ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు. – వేముల రమాదేవి, ఇందిరానగర్ కాలనీ

అంతర్గత డ్రైనేజ్ నిర్మాణానికి మోక్షం



గ్రామంలో ఎప్పటి నుంచో రోడ్లు, డ్రైనేజ్‌లు, కల్వర్టులకు మోక్షం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వాటికి మోక్షం కలిగింది. అంతర్గత డ్రైనేజ్ పనులు చేపట్టారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పట్టించుకోలేదు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిజాంపట్నం కాల్వపై వంతెన ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంది. – వట్టిప్రోలు అశోక్, జాషువానగర్, నందివెలుగుడ

రమణీయంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న బాలస్వామీజి

తెనాలి టౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజ్య శ్రీ బాలస్వామీజి పర్యవేక్షణలో శనివారం శ్రీనివాసుడికి ఉదయం తిరుమల వేద పండితుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాలసేవ, కొలువు అర్చన, బాలభోగం, నవనీత హారతి, దివ్య ప్రబంధం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పద్మావతి సమేత సుందర శ్రీనివాస పెరుమాళ్ల కల్యాణం నిర్వహించారు. భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు రామానంద భారతీ స్వామి శ్రీనివాసుని వైభవాన్ని వివరించారు. శ్రీశైలక్షేత్ర వాసవీ సత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వరరావు స్వామి విశిష్టతను వివరించారు. కల్యాణం సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, వుప్పల నాగేశ్వరరావు, ఎం.రమణయ్య, రామకృష్ణ, కౌన్సిలర్ సాయిహరేరామ్, మఠం సభ్యులు, శ్రీ విద్యాపీఠం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ సక్రమంగా చేయండి



తెనాలి అర్బన్: పట్టణంలో చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సిబ్బందికి సూచించారు. 30వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. అనంతరం వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడిక తీత పనుల్ని పరిశీలించారు. ఆమె వెంట 30వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొమరాబత్తిని జయపాల్, తోట రఘురామ్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనుపమ, ఏఈ రాజు, ఆర్‌ఐ మోహన్‌కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

యడ్ల లింగయ్యనగర్‌లో పేదలకు పట్టాల పంపిణీ

ఎమ్మెల్యే అన్నాబత్తుని చొరవతో మంజూరు

తెనాలి: ఎంతో కాలం కిందట పేదలకు ఇచ్చిన నివాసస్థలాలవి...ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరికి స్థలం, ఇల్లూ ఉన్నా ప్రభుత్వం ఇచ్చినట్టుగా పట్టా ధ్రువీకరణ లేదు. పట్టణ 32వ వార్డులో గల యడ్ల లింగయ్య నగర్‌లోని 14 మంది సమస్య ఇది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇంటింటికీ వెళ్లినపుడు ఆ సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన తహసీల్దారు కె.రవిబాబుతో విచారణ చేయించారు. వాస్తవాలను ధ్రువీకరించుకుని పట్టాలను సిద్ధంచేశారు. స్థానిక గంగానమ్మపేటలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే శివకుమార్ ఆయా పట్టాలను 14 మందికి పంపిణీ చేశారు. సమస్యను చెప్పుకోగానే స్పందించి, తక్కువ వ్యవధిలోనే పట్టాలను ఇప్పించిన ఎమ్మెల్యేకు అంతా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మట్లపూడి రాజేశ్వరరావు, సయ్యద్ గౌస్, కసుకుర్తి నాగమల్లేశ్వరరావు, అద్దేపల్లి శివనాగేశ్వరరావు, షేక్ సైదా, అక్కిదాసు కిరణ్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే శివకుమార్

త్వరలో మురుగునీటి శుద్ధి ట్రీట్‌మెంట్ ప్లాంటు ట్రయల్ రన్

పట్టణ 11వ వార్డులోని పూలే కాలనీలో మున్సిపాలిటీ నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ట్రీట్‌మెంట్ ప్లాంటును శనివారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించారు. మురుగునీటిని శుద్ధిచేసి తిరిగి వాడుకునేందుకు వీలుగా ఈ ప్లాంటును ఆధునిక టెక్నాలజీలో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. దేశంలోని అత్యుత్తమ టెక్నాలజీతో తయారై ఈ ప్లాంట్‌ద్వారా శుద్ధిచేసిన మురుగునీటిని, ఆ ప్రాంతంలోని పంట పొలాలకు తరలించడం ద్వారా ఏడాది పొడవునా సాగుకు నీటి కొరత లేకుండా చూడొచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ డిజైన్‌తో నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంటుకు త్వరలోనే ట్రయల్‌రన్ నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, మున్సిపల్ ఇంజనీరు కె.నాగమల్లేశ్వరరావు, కిలారి ఇన్‌ఫ్రాస్టక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి కిరణ్‌రెడ్డి, పార్టీ నాయకులు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో హర్షితకు ద్వితీయ బహుమతి

'సోర్ హై ఎబౌవ్ యువర్ ఫియర్స్' చిత్రానికి దక్కిన గౌరవం

తెనాలి: అతి చిన్న రాతిపై క్షీరసాగర మథనాన్ని చిత్రించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన డి.హర్షిత తాజాగా హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలిచింది. 'సోర్ హై ఎబౌవ్ యువర్ ఫియర్స్' అనే టైటిల్‌తో చిత్రీకరించిన బొమ్మకు ఈ బహుమతి లభించింది. తెనాలికి చెందిన హర్షిత ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్సీ (జువాలజీ) రెండో సంవత్సరం చదువుతోంది. చిన్నతనం నుంచీ చిత్రలేఖనంపై ఆసక్తి, సాధనతో పట్టు సాధించింది. సాంఘిక సంక్షేమ హాస్టలులో ఉంటూ తెనాలిలో బీఎస్సీ చదువుతుండగా, ఫైనలియర్‌లో 4.6 సెం.మీ ఎత్తు, 5 సెం.మీ వెడల్పు కలిగిన చిన్న రాతిపై పురాణాల్లో అతి పెద్ద వృత్తాంతాల్లో ఒకటైన క్షీరసాగర మథనాన్ని చిత్రీకరించింది. కేవలం 15 నిముషాల్లో చిత్రించిన బొమ్మను వీడియో తీయగా, కాలేజీ యాజమాన్యం ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపారు. దీంతో హర్షితను అభినందిస్తూ, ఆ పుస్తకంలో పేరు నమోదు చేసి ధృవీకరణకు పంపారు. ప్రస్తుతం ఆచార్య నాగార్జున యూనివర్సిటీల్లో ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరంలో ఉన్న హర్షిత తన అభిరుచి మేరకు బొమ్మలను గీస్తోంది. హైదరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ విమెన్‌లో ఇటీవల 2023 సంవత్సరానికి జరిగిన జాతీయ చిత్రకళా పోటీల్లో హర్షిత పాల్గొంది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆకాశమే నీ హద్దుగా ఎగిరిపో అనే భావంతో 'సోర్ హై ఎబౌవ్ యువర్ ఫియర్' అనే టైటిల్‌తో రూపొందించిన బొమ్మ ఇది. అసమానత, వేధింపులు, వివక్ష, భయాలు, గృహహింస, బాల్యవివాహం వంటి బంధనాలను తెంచుకుని, రెక్కలొచ్చిన నీవు ధైర్యంగా ఎగురు అనే సందేశంతో ఉన్న ఈ చిత్రానికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. పేద కుటుంబంలో జన్మించిన హర్షిత లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనీ, ప్రవృత్తిగా చిత్రకళను కొనసాగించాలనేది తన అభిమతంగా చెప్పారు.



హర్షిత గీసిన చిత్రం



బహుమతులతో హర్షిత

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి: పట్టణ బోసురోడ్డులో గల శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రం ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కార్యనిర్వహణాధికారి మండెపూడి పానకాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ధర్మకర్తల మండలి నియామకం కోసం దేవదాయ శాఖ ఉపకమిషనర్ ఈనెల ఒకటో తేదీన ఉత్తర్వుల (ఇన్.ఆర్.సీ.నెం.ఎ4/235/2024)ను జారీ చేసినట్టు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రంలో అందజేయాలని కోరారు.

క్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శం



వాక్యపరిచర్య చేస్తున్న డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్



పెద్ద సంఖ్యలో హాజరైన క్రైస్తవులు

- డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్
- తెనాలిలో ముగిసిన సువార్త స్వస్థత మహాసభలు
- పెద్దసంఖ్యలో హాజరైన క్రైస్తవులు

తెనాలి అర్బన్: క్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శమని విజయవాడకు చెందిన అంతర్జాతీయ ప్రసంగికులు డాక్టర్ పాల్ ఇమ్మానియేలు పేర్కొన్నారు. తెనాలి చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో క్రైస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సువార్త స్వస్థత మహాసభలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకరక్షకునిగా భూలోకానికి వచ్చారని చెప్పారు. ఆయన బోధించిన ప్రేమతత్వాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. చరిత్రలో ఏసుక్రీస్తుకు ప్రాధాన్యత ఉందని, అందుకే ఆయన పేరిట క్రీస్తు శకం, క్రీస్తు పూర్వమని చెబుతారని వివరించారు. ప్రజలంతా శాంతి,సౌభాగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు రెండోవ రాకడ గురించి తెలియజేశారు. ముందుగా బ్రదర్ నైసిల్, బ్రదర్ డానియేల్, బ్రదర్ సూర్య, బ్రదర్ ఆసాఫ్ దేవ్‌లు క్రైస్తవ గీతాల్ని ఆలపించారు. సిస్టర్ నిస్సిపాల్, ఆమె బృందం శక్తివంతమైన ఆరాధన చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సభలకు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేయించుకున్నారు. కార్యక్రమంలో క్రైస్ట్ టెంపుల్ పెద్దలు దావులూరి కిరణ్, పిల్లి డానియేల్, ఉబేద్, రవి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం శనివారం రాత్రి వెల్లడించారు. మండలంలోని కోపల్లెకు చెందిన బాణావత్ నాగమల్లేశ్వరరావు 40 మద్యం సీసాలను బైక్‌లో తరలిస్తూ జగ్గడిగుంటపాలెం వద్ద పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో ఘటనలో తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో అంగలకుదురుకు చెందిన బొల్లు రవి మద్యం విక్రయిస్తుండగా త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అరెస్టు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ చలం